# పెళ్ళి ఆగిపోయింది

నా పెళ్ళి ఆగిపోయింది.

పెళ్ళికొడుకు వన్ను ముందర చూడక, నా వలువు, ఎత్తుపళ్ళ వంపు, మెల్లకన్ను సొంపు అప్పుడే చూడడం వలన కాదు.

నేను అపురూప సౌందర్యవతిని.

కట్నం చాలలేదని, ఆడబడుచులకు చీరలు అంద లేదని, లాంఛనాలు సరిగా జరగలేదని, పెళ్ళి ఏర్పాట్లు బాగాలేవని కాదు.

మా నాన్నగారు అప్పకి కూడా వెరువక మర్యాదలు సరిగా జరిపారు. ఆకాశమంత పందిరి వేశారు.

నా శీలం మంచిది కాదని, నేను అల్లరి చిల్లరగా తిరిగేదాన్నని పెళ్ళివారికి ఎవరో అబద్ధాలు చెప్పడం వలన అంతకన్నా కాదు.

నా సౌశీల్యం వారికి చాలా నచ్చింది.



అబ్బాయి కంటే అమ్మాయి పెద్దదని, వారు ఆలస్యంగా గ్రహించడం వలనా కాదు.

నేను అతని కంటే అయిదేళ్ళు చిన్నదాన్ని. మాది మేడ్‌ఫర్ ఈచ్ అదర్ జంట.

కర్ణుడి చావుకి కారణాలు ఎన్నో అన్నట్లు ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి ఆగిపోవడానికి కారణాలు ఎన్నో వున్నాయి. మా నాన్నగారు మరలా ఇంత ఖర్చు నేను భరించ, నాకు పెళ్ళి చేయులేనని ఉరేసుకోబోయారు. ఆలస్యంగా వచ్చిన నా కాబోయే భర్త ఆ పని ఆపు చేయించాడు.

ఆయన ఒక పూట ఆలస్యంగా రావడానికి కారణం — పై కారణాలు ఏమీ కాదు, అనుకోకుండా వర్షం వచ్చి దారులు కొట్టుకొని పోవడం. మా పెళ్ళికి వర్షం అడ్డువచ్చింది. మా పెళ్ళి ఆగిపోయింది. కాని నెల తరువాత అయింది రిజిస్ట్రారు ఆఫీసులో.

—'రాధిక'

# సొగసరి-గడసరి

తమ అష్టావధాన శతావధానాలతో ఆంధ్రదేశంలో సాహితీ చైతన్యాన్ని కలిగించి, పాండవోద్యోగ విజయాల ద్వారా నాటక పిపాసను రేకెత్తించిన పుంభావ సరస్వతులు తిరుపతి వెంకట కవులు. వారి పూర్తి నామధేయాలు దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిను. దివాకర్లవారిది పశ్చిమ గోదావరి జిల్లా ఎండగండి, వెంకట శాస్త్రిగారిది తూర్పుగోదావరి జిల్లా కడియముగ్రామం.

వీరిద్దరిలో వెంకటశాస్త్రిగారు వర్మోక్తులు విసురుతూ, హాస్య సంభాషణ సాగిస్తూ, తమ చతుర వచోవిలాసంతో అందరి మనస్సుల్నీ ఆకట్టుకొనేవారు. అర్థవంతంగా మాట్లాడి అవతలివాళ్ళని ఆశ్చర్యంలో ముంచడం, అవసరం అయితే నోరు మూయించడం ఆయనకి వెన్నతో పెట్టిన విద్య.

ఓమారు వెంకటశాస్త్రిగారు మండపేట వెళ్ళారు. అక్కడ ఆ రోజుల్లో కళాభిజ్ఞత, రసజ్ఞత, లోకజ్ఞత గల వేశ్యా మణులెందరో వుండేవారు. వారిలో నృత్య గీతాది లలిత కళల్లో ఆరితేరిన ఓ యౌవనాంగి వుండేది. ఆమె పేరు మణి!

వెంకటశాస్త్రిగారి సాన్నిధ్యంలో మణి అద్భుతంగా నాట్యం చేసింది. శాస్త్రిగారు ఎంతో సంతోషించారు. ఆమెని అభినందించారు. అభినందించి ఊరుకోలేదు. చివర్ని కొంటెగా "మణి మామూలుగా వుండేకంటే, కడియంలో వుంటే, సార్థకత లభిస్తుంది. శోభస్కరంగా వుంటుంది" అన్నారు. అంటే, "మా ఊరు కడియం, అక్కడికి రా" అని అర్థస్ఫూర్తితో చెప్పారన్న మాట.

ఆమె ఏం తక్కువది కాదు.

వెంటనే, పేట అనే మాటకి మండ పేట, మెడలోవేసుకొనే బంగారపు గొలుసు అనే రెండర్థాలు స్ఫురించేలాగ



"మహాకవులు! తమకి తెలియంది ఏముం ది? స్వచ్ఛమైనమణి, కడియంలో వుంటే ఏమిటి, పేటలో వుంటే ఏమిటి" అని సమాధానం ఇచ్చింది. వెంకటశాస్త్రిగారి చతురతకి దీటైన చతురత అది. ఆయన వెంటనే నవ్వి "సొగసరివేఅనుకున్నా-గడసరి కూడా అన్నమాట" అని అభినందించారు.

— పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## అవివాహితుడు

ఒక సభలో శ్రీ కట్టమంచి రామ లింగారెడ్డి గారిని ప్రస్తుతిస్తూ ఒక వక్త "శ్రీ రెడ్డిగారు ప్రముఖ విద్యావేత్త. బ్రహ్మచారి" అన్నారు. ఆ మాట పూర్తికాకుండానే రెడ్డి గారందుకుని "నేను విద్యావేత్త నౌనో కాదో నాకు తెలియదు కాని బ్రహ్మచారిని మాత్రం కాదు. అవివాహితుడను మాత్రమే. ఈ




వక్త నన్ను 'బ్రహ్మచారి' అని చెప్ప గల నాకు తెలియని ఆధారాలు ఇతని దగ్గర ఏమున్నాయో తెలియ జేయవలసిందిగా అభ్యర్థిస్తున్నాను" అన్నారట సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య.

— వేమకోటి ఉమా మహేశ్వరరావు

